


# ఐనట్టయ్యోగాక..

# అన్నమయ్య పదాలు సామాజిక దృక్పథాలు

ఈ భూమ్మీద పుట్టిన ప్రతీ మనిషికీ కామ క్రోధ మద మాత్సర్యాలు లేకుండా జీవించడం కష్టం! ఈ నాలుగే కాకుండా మనుషులని ఇంకా కొన్ని దుర్గుణాలు కూడా పట్టి పీడిస్తాయి . అవి  అసూయ, ఓర్వలేని తనం! ఈ రెండూ మనిషి ప్రవర్తనని పతనావస్థకి చేరుస్తాయి. అసూయ అయినవారి అంతం చూస్తుంది.

ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతీ మనిషీ ఒకేలా ఉండడు. ఒక్కో మనిషి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. కొంతమందికి ప్రత్యేకమైన కళలబ్బుతాయి. ఈ అబ్బిన వాటిల్లోనూ హెచ్చు తగ్గులుంటాయి. కొంతమందికి ఎక్కువ సృజన ఉంటుంది. పక్కవాడిలోని గొప్పతనాన్ని సృజనని గుర్తించడానికి చాలా పెద్ద హృదయం కావాలి. మెచ్చుకోవడానికి మనసు రావలి.

ఒక్కోసారి మనం పక్కవాళ్ళ గొప్పని గుర్తించినా పైకి అనం !

ఏ రకమైన భావన బయటపడకుండా బానే ఉందిలే అని నిట్టూర్చేస్తాం. కొంతమందైతే బాగున్నా బాగోలేదని, కావాలని ఇతరుల మనసుల నొప్పిస్తారు. ఇది మన చుట్టూ ఉన్న ప్రపంచ లక్షణం. ఈ అవలక్షణాన్ని వదిలించుకుంటే మనిషిగా నిజమైన జీవితం గడిపిన వారవుతారు.

క్షణ భంగురమైన ఈ జీవితంలో మంచి మాటలాడడం, ఎవ్వరినీ నొప్పిచకుండా బ్రతకడం కష్టం, కానీ అసాధ్యం మాత్రం కాదు. ఇతరుల్లో చెడుని గుర్తించి చెప్పడానికి ఎంత ఎక్కువ ధైర్యం కావాలో వారిలో మంచినీ, సృజననీ మెచ్చుకోవడానికి పదిరెట్ల ధైర్యం కావాలి. ఇటువంటి విషయాన్నే అన్నమయ్య తత్వం కూడా జోడించి అతి సులభంగా చెప్పాడు.

ఆ కాలంలో అన్నమయ్య కవిత్వానికి అందరూ పిలిచి పీట వేయలేదు. కొంతమంది మెచ్చుకుంటే, కొంతమంది వెక్కిరించారు. అన్నమయ్య కవిత్వమూ హేళనికి గురి అయ్యింది. ఈ కీర్తనలూ ఏమంత గొప్పవీ కావు,  పరవాలేదు, బాగానే ఉన్నాయి, చెత్తకవిత్వానికి దగ్గరగా ఉంది లాంటి విమర్శలకీ గురయ్యింది అన్నమయ్య కవిత్వం. లోకో భిన్న రుచి. మన కిష్టమైన పదార్థమైనా, కవిత్వమైనా మన చుట్టూ ఉన్న అందరికీ నచ్చాలని లేదు. కొంతమంది మెచ్చవచ్చు, మరికొంతమంది పెదవి వెరచవచ్చు. ఈ సత్యమెరిగిన వాళ్ళు ఇతరుల మనసు కష్ట పెట్టడానికి సాహసించరు. ఈ జీవితం హరి సంకల్పితం. చేరాతలు తలరాతలూ అన్నీ హరి నిర్దేశకాలే అంటూ అన్నమయ్య తన బాధనీ విచారాన్నీ  ఒక మంచి కీర్తనలో వెలిబుచ్చాడు.

*ఐనట్టయ్యోగాక హరి కల్పితములివి*
*మానేటి వేటివో మానని వేవో* -- పల్లవి - -

కవిత్వపు సొబగులు దిద్ది కీర్తనలు పాడడం అనేది దైవ కృప వలన సంభవించింది. ఈ సృష్టి మొత్తం హరి కల్పితమే కాదు, చేసే ప్రతీ పనీ హరి సంకల్పమే కదా ! అటువంటప్పుడు ఇతరులకు నచ్చలేదని కీర్తనలు వద్దంటే ఎలా? ఏది మానాలో, ఏది మానకూడదో నిర్దేశించడానికి మనమెవ్వరం?

*వొక్కరు తలచినట్టు వొకరి తలపు రాదు*
*పక్కన నందరికి బహుభావాలు*
*అక్కట మొదలొకటి అనలు గొనలు వేరు*
*ఎక్కడని తగిలేది ఏమి సేసేది -- ఐన --*

ఒకే వస్తువు వర్ణిస్తూ ఏ ఇద్దరి కవిత్వమూ ఒకేలా ఉండదు. ఎవరి ఆలోచనలు వారివి. ఒకరు భావ ప్రకటన చేసిన రీతిలో ఇంకొకరిది ఉండదు. తుది మొదలు లేని ఈ ఆలోచనలు ఆపడం ఎవరి కి సాధ్యపడేది? ఎవరి కవితా రీతులు వారివి.

*పొరుగువాని చేత ఆపొరుగువాడు మెచ్చడు*
*నరుల కర్మములు నానా విధములు*
*గరిమ నన్న మొక్కటే కడుపుతనవి వేరు*
*కరుణించౌనన నేవి కావన నేవి -- ఐన --*

ఎక్కడైనా మంచివిషయం ఉంటే మెచ్చుకోవడం ఉత్తముల లక్షణం. కానీ ఈర్ష్యాసూయాద్వేషాలతో నిండితే ఇతరుల మంచి ఎలా తెలుస్తుంది.పొరుగువాడు చేసే పనిని ఇంకొక పొరుగువాడు మెచ్చడు. ఇది మానవ నైజం. మనం తినే అన్నం ఒకటే అయినా ఒక్కొక్కరూ ఒక్కొక్క రకంగా అనుభూతి చెందుతారు. ఒక్కో కడుపుకి ఒక్కో రకంగా ఆకలి చల్లారుతుంది. ఒకరి అమృతంలా అనిపించిది ఇంకొకరికి కానే కాదు.

*కడగి దరిద్రుని మాట కలవాని కింపుగాదు*
*బెడగు జీవులందు పెక్కు రీతులు*
*కడు శ్రీవేంకటేశు డొక్కడు జగత్తులు వేరు*
*వాడిగట్టుకొనే దేది వొల్లననేదేది -- ఐన --*

పేదవాడి పలుకు పెదవికి చేటు. అవి ఎంత మంచి విషయమైనా ఆ మాటలు ధనవంతులకింపు గాదు. ఒక వ్యక్తియొక్క జీవన విధానంపై ఒక విషయం పై అభిప్రాయమైనా, సలహా అయినా ఆధారపడి ఉంటుంది. ఈ సృష్టిలో ఒక్కో జీవి ఒక రకంగా ఉంటారు. జీవులు ఎన్నైనా వేరైనా పరమాత్మ ఒక్కడే! ఆ వేంకటేశ్వరుని పాదారవిందలకి మొక్కడం తప్ప మనం ఏమి చేయగలం. ఏది మనకి ప్రాప్తమో అదే మనదగ్గరుకు చేరుతుంది.

ఈ కీర్తనలో ఆధ్యాత్మిక తత్వం కనిపించినా, మానవ నైజం ఎలా ఉంటుందన్నది స్పష్టంగా కనిపిస్తుంది. అసూయ తో అవతల వారిలోని గొప్పతనాన్ని గుర్తించడం కూడా గొప్పే! విద్వత్తు లేకపోతే సరే ! ఉన్న వాడిని ఉంది అని ఒప్పుకోవడానికెవరికీ అభ్యంతరం ఉండకూడదు అని అన్నమాయ్య తన కవిత్వాన్ని తూలనాడినందరికీ సుతిమెత్తగా చురకలు అంటించి, నచ్చితే మెచ్చండి. నచ్చకపోతే దూరంగా పొండి కానీ దుర్భాషలు మాత్రం చేయకండి అని వేంకటేశ్వరుని సన్నిధిలో అందరి తరపునా వేడుకున్నాడు. ***